# బీఆర్ఎస్‌కే ఓటేద్దాం



సిద్దిపేటలో మాట్లాడుతున్న దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి



సమావేశానికి హాజరైన దివ్యాంగులు

- దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపింది బీఆర్ఎస్ సర్కార్
- మంత్రి హరీశ్ రావుకు లక్షన్నర మెజార్టీ అందించాలి
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన నియోజకవర్గ దివ్యాంగులు
- సిద్దిపేట నియోజకవర్గ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ రెడ్డి

సిద్దిపేట,నవంబర్ 6: దివ్యాంగులను గుర్తించి అండగా నిలబడిన బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌కు దివ్యాంగులమంతా అండగా నిలబడుతాం.. మంత్రి హరీశ్‌రావుకు సంపూర్ణ మద్దతునిచ్చి రాష్ట్రంలోనే భారీ మెజార్టీతో గెలిపిద్దామని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట కొండమల్లయ్య గార్డెన్‌లో నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా సిద్దిపేట నియోజకవర్గ దివ్యాంగులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు లక్షా 50వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనలో దివ్యాంగుల బతుకులు దుర్భరంగా ఉండేవని.. పింఛన్ పెంచి మనకు అండగా నిలిచింది సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కల్లబొల్లి మాటలను నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పింఛన్ రూ.1,500కు మించి లేదని తెలిపారు. మంత్రి హరీశ్‌రావుకు భారీ మెజార్టీ ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం బలహీన వర్గాలకు భద్రత ఇస్తున్నదని, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లలను ఉచితంగా వంద శాతం సబ్సిడీపై ఇచ్చినట్లు తెలిపారు. దివ్యాంగులకు సబ్సిడీపై రుణాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో రూ.వెయ్యి లోపు ఫించన్ ఉందని, అక్కడ 47 వేల మందికి మాత్రమే పింఛన్ ఇస్తున్నారని, తెలంగాణలో 5 లక్షల మందికి పింఛన్ రూపంలో రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. తిన్న రేవును మర్చిపోవద్దని సూచించారు. ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం వచ్చిందని, దీనిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, నంగునూరు జడ్పీటీసీ ఉమా వెంకట్‌రెడ్డి, నారాయణరావుపేట ఎంపీపీ బాలకృష్ణయాదవ్, బీఆర్ఎస్ చిన్నకోడూరు మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు రఫీ, దండు శంకర్, భూపతిరెడ్డి, ఖమ్మంపల్లి బాలయ్య, వేణు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ఎనలేని కృషి

దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ రూ.4,000 పింఛన్ అందిస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. ఆలోచన శక్తి బాగుంటే మన లక్ష్యం సిద్ధిస్తుందని, మంత్రి హరీశ్‌రావు పెద్ద మనసుతో దివ్యాంగులకు ఉచితంగా స్కూటీలను అందించినట్లు తెలిపారు. మంత్రి హరీశ్‌రావుకు దివ్యాంగులు అండగా ఉండి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు వస్తే దివ్యాంగుల సంక్షేమం కోసం ఏమి చేశారని నిలదీయాలన్నారు. మంత్రి హరీశ్ రావును ఆశీర్వదించి లక్షన్నర మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ



మాత్‌పల్లిలో ప్రచారం చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతే..

**ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి**

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 6: గజ్వేల్‌లో ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండల కేంద్రంతో పాటు రామచంద్రాపురం, తిప్పారం, మాత్‌పల్లి గ్రామాల్లో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీరవీందర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలుకుతున్నారని, ప్రజల ఉత్సాహం చూస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లక్షా 50వేల మెజార్టీ దాటుతుందన్నారు. ఏండ్ల కల కుకునూరుపల్లి మండల ఏర్పాటును సాకారం చేసిన సీఎం కేసీఆర్‌కే మొత్తం ఓట్లు వేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో చాలా బాగుందన్నారు. నల్లధనం వెనక్కి తీసుకువచ్చి ఒక్కొక్కరి జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తానన్నా మోదీ మాట తప్పారని, అదానీ లాంటి వ్యాపారులకు దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. గత కాంగ్రెస్ పాలనలో యూరియా దొరకక, కరెంట్ లేక, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, స్వరాష్ట్రంలో ఆ ఇబ్బందులన్నీ తీరాయన్నారు. ప్రతిపక్షాలకు ఇప్పటికీ అభ్యర్థులు సైతం దొరకని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణకు సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష అని గజ్వేల్ నుంచి భారీ మెజార్టీతో గెలిచి ముడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోలా సద్గుణారవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్ పాల్గొన్నారు.

# మూడో రోజు 9 నామినేషన్లు

హుస్నాబాద్, నవంబర్ 6: హుస్నాబాద్ అసెంబ్లీ స్థానానికి సోమవారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి పి.బెన్ షాలోమ్ తెలిపారు. ఇందులో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, కేశవేని సమ్మయ్య, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా బోయిని సదన్ మహరాజ్ నామినేషన్లను దాఖలు చేసినట్లు వెల్లడించారు. హుస్నాబాద్ ఆర్వో పరిధిలో ఇప్పటివరకు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు.





హుస్నాబాద్: ఇండిపెండెంట్ అభ్యర్థి నుంచి నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్వో బెన్ షాలోమ్

**సిద్దిపేటలో రెండు దాఖలు**

సిద్దిపేట, నవంబర్ 6: అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి మూడో రోజు సోమవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆధికారి రమేశ్‌బాబు తెలిపారు. మూడో రోజు నామినేషన్లు వేసిన వారిలో మిట్టపల్లి గ్రామానికి చెందిన వర్కోల్ శ్రీనివాస్, సిద్దిపేట పట్టణానికి చెందిన ఎక్కల దేవీలింగం నామినేషన్ వేసినట్లు తెలిపారు.

**గజ్వేల్‌లో ఒకటి**

గజ్వేల్, నవంబర్ 6: గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి మూడో రోజు సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. మనోహరాబాద్ మండలం చెట్లగౌరారం గ్రామానికి చెందిన బక్క సదీశ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటివరకు గజ్వేల్ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

**దుబ్బాకలో మూడు**

దుబ్బాక, నవంబర్ 6: దుబ్బాక శాసనసభకు సోమవారం మరో 3 నామినేషన్లు దాఖలయ్యాయని దుబ్బాక రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 6 నామినేషన్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ తరపున గౌటి మల్లేశ్(పెద్ద గుండవెల్లి), స్వతంత్ర అభ్యర్థిగా పెద్దలింగన్నగారి ప్రసాద్(లింగుపల్లి), ధర్మ సమాజ్ పార్టీ తరపున వేముల వెంకట ప్రసన్న(అప్పనపల్లి) నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

# కేసీఆర్ గెలుపునకు సైనికుడిలా పనిచేయాలి

**ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

గజ్వేల్, నవంబర్ 6: గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలంటే ప్రతి యువకుడు సైనికుడిలా పని చేయాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో గజ్వేల్ పట్టణానికి చెందిన 35మంది యువకులు కాంగ్రెస్‌ను వీడి రాష్ట్ర నాయకుడు జుబేర్‌పాషా ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. గతంలో గజ్వేల్‌కు ఇప్పటి గజ్వేల్‌కు మార్పును తెలియజేయాలన్నారు. గజ్వేల్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. గజ్వేల్ పట్టణంలో కొత్త భవనాలు, ప్రభుత్వ దవాఖానలు, అద్భుతమైన రేడియల్ రోడ్లు, లైట్లు, ఐవోసీ కార్యాలయం ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. ములుగు వద్ద విశ్వ విద్యాలయాల నిర్మాణంతో నేడు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన నేతలతో మంత్రి హరీశ్‌రావు

# స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 6: జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సిద్దిపేట నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌తో పాటు ఏ బ్లాక్‌లోని దుబ్బాక నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌ను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్ పరిశీలించారు. ఈ మేరకు కేంద్ర బలగాల గార్డులతో మాట్లాడి డ్యూటీ సమయ వేళలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరా పుటేజ్, టీవీలను పరిశీలిస్తూ సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే ఆర్ఓ లేదా ఏఆర్ఓకు తెలపాలన్నారు. ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేశ్‌కు తెలిపారు. నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ సెంటర్లు ఇక్కడే ఉన్నందున మైదానంలో పార్కింగ్, ప్రతి నియోజవర్గానికి ప్రత్యేక మార్గాల వారీగా బారికేడ్ అమర్చాలని అధికారులను ఆదేశించారు. ఏసీపీ సురేందర్‌రెడ్డి, ఏఆర్ఓ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ పాటిల్

## విధుల్లో నిర్లక్ష్యం వద్దు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 6: మనీ, లిక్కర్ అక్రమంగా రవాణా జరగకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జిల్లా వ్యయ పరిశీలకుడు వెంకటేశ్‌బాబు సూచించారు. సోమవారం తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ శిబిరాన్ని పరిశీలించారు. ఈ మేరకు స్పెషల్ ఆఫీసర్ సీతారామరాజు, త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్‌తో మాట్లాడారు. స్పెషల్ ఆఫీసర్, పోలీస్ అధికారులు షిఫ్టుల వారీగా 24 గంటలు, మూడు షిఫ్టుల్లో అప్రమత్తంగా ఉండి అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మనీ, లిక్కర్ అక్రమంగా రవాణా కాకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా కలెక్టరేట్ నుంచి ఎస్ఎస్‌టీ పనితీరును ఎల్లప్పుడూ మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు.